# రోగ నిద్ర

దోగిపర్తి వెంకట రమణ

కెవ్వుకెవ్వుమని హెచ్చు తగ్గుల స్థాయిలో ఏడిచేస్తున్నాడు, ఇరవై నాలుగు గంటల క్రితం భూమిమీద మానవశరీర రూపం దాల్చిన ఆత్మ. ప్రక్క బల్లమీది దీపం ఊపిరి పోవడానికి సిద్ధంగావుంది. ఊగుతూ ఊగుతూ కాంతి కిరణాలు అంధ తమసాల పొగరణచలేక ఉన్న చోటే జోగుతున్నయ్.

శకుంతలకదే తొలికాన్పు. పిల్లవాడి ఏడుపు ఆమె నిద్రను పెల్లగించేసింది. "నా నాయనా, నా నాయనా" అంటూ సముదాయించినా ఏడుపు పోలేదు.

"పిల్లవాణ్ణి ఊరుకో బెట్టుకోవే అబ్బ! పెంకు లెగర గొట్టేస్తున్నాడు" వసారాలో అత్తగారు కేకలేస్తోంది.

"ఎంతకీ ఊరుకోటంలేదు నేనేంచేయను?" శకుంతల నిస్సహాయత్వం కనబరచింది.

"పాలు తక్కువయ్యాయేమో! కాస్త పాలియ్యి!" అత్తగారు ఉపాయం చెప్పింది.

శకుంతల హృదయంలో జృంభమాణంగా మాతృత్వం పరవళ్లు త్రొక్కింది. అవును పిల్లవాడికి పాలీయక పోతే యెలాగ? ప్రొద్దుట తానెంత పేచీ పెట్టింది పాలీయడానికి!

"గ్లాస్కో పాలు పోయండి. నే నీయలేను బాబూ" హృదయంలో పెనగొన్న మధుర బాధతో అంది.

పిల్లవాడూరుకున్నాడు. దీపంలో ఉన్న కాస్త ఊపిరీ పోయింది. గదంతా కాటుక వాన. శకుంతల, "ఛీ! కిరసనాయిలు దీపం నిండా అయినాపోయదు" అంటూ విసుక్కుంది.

శకుంతల కాపురానికివచ్చి దరిదాపు రెండేళ్ళయింది. ఇంతకాలం అత్తగారి బాధ తప్పలేదు. అందరు ఆడపిల్లలు భరించాల్సిన అత్తపోరు ఆమెకు తప్పలేదు.

శకుంతల తల్లీ తండ్రీలేని పిల్ల. పిన్నిగారింట్లో పెరిగి వచ్చింది. పిన్ని యింట్లో ఉన్నంత కాలం సుఖమంటే ఏమిటో ఎరగని పసికూన. అత్త యింట్లో అయినా తనకు తగిన సుఖశాంతి లభించటంలేదు.

* * *

"ఏమే శకూ. ఇంకా మొద్దు నిద్దరే. ప్రొద్దెక్కిపోయింది లే" అత్తగారి గొంతుకే శకుంతలకు మెళకువ తెచ్చింది. శశి హాసం లాగున్న బిడ్డడి ముఖంవైపు చూచుకొని మురిసిపోయింది.

స్నానాది కృత్యాలు పిల్లాడికి నిర్వర్తించారు. తల్లికి కూడా ఆనాడే పూర్ణస్నానం చేసివేసారు. ఇన్ని రోజులయిందిగాని సూర్యం ఆ వైపుకే రాలేదేం? ఏదో మహాపరాధం చేసినవాడికి మల్లే తప్పుకు తిరుగుతున్నాడే?

సూర్యం దూరంనుంచి తొంగిచూస్తున్నాడు. చిరునవ్వు సొగసుతో శకుంతల ఆహ్వానించింది. అతను ముఖం త్రిప్పేసుకుపోయేడు. అయ్యో! చిట్టిబాబును చూచి ఎంత మురిసిపోదామనుకొని కలలు కంది. పిల్లాడేం అందంగా లేడా? రత్న కళికలాగ మెరిసిపోతున్నాడు! ఆ సోగకన్నుల నీలిరేఖల్లో అనంతాకాశాలు దాచుకొన్నాడు. ఆ చిరునవ్వు వెన్నెలలో చందమామను చేబట్టుకొన్నాడు.

అతను వస్తే, తను సిగ్గుతో తల వంచుకొని అతనిచేతి కందించేసి... లజ్జాహాసాలతో తను ప్రక్కకి తప్పుకుంటుంది. అబ్బ! ఆయన పిల్లాణ్ణి ముద్దులు పెట్టుకుంటూంటే తన చెక్కిళ్ళు పులకరించిపోతై. హృదయం కట్టలు తెగి పొర్లి పారుతుంది.

తనుపిల్లాణ్ణి ఆయన చేతిలోంచి లాక్కుంటూ "వదిలేయండి! నా బిడ్డను. నా కన్న తండ్రి" అంటూ హస్తాల్లోంచి తన కరాల్లోకి మళ్ళించుకొని, తన పెదవుల్లతో ముద్దు పెట్టుకుంటుంది. అబ్బ! ఎంత మధురాతి మధుర ఘట్టం! శకుంతల భర్త సూర్యం మధ్యాహ్నం కనిపించేడు.

"ఇదిగో! అబ్బాయిని చూడండి ఎవరి పోలికలో?" సూర్యం శకుంతల ముఖంలోకి చూచేడు. మాతృవదనంలో దేదీప్యమానమైన మాతృత్వ స్వర్ణముద్రలు పరిఢవిల్లుతున్నాయి. నవ కోస కళలు నాట్యమాడుతున్నై. కరుణాత రంగితంగా అతని హృదయం ఉద్వేగంగా లేచి నర్తించింది.

"శకూ! మంచివాణ్ణే కన్నావ్?"

"ఇదిగో! తీసికోండి" అంటూ చేతుల్లోకి అందించబోయింది. సూర్యం నవ్వుకుంటూ ముందుకు సాగిపోయేడు. పిల్లవాడు చిన్న చిన్నగా నవ్వేడు శకుంతల ముఖం చూస్తూ.

* * *

"పిల్లేం ఆరోగ్యంగా లేదురా" అంది సూర్యం తల్లి.

"ఏం రోగం? ఇల్లు గడవటమే గగన మౌతూంటే, మీమీ తెగుళ్లకి నేనెక్కడినుంచి డబ్బుతేనూ? ఎవడి బుర్రనాన్న బద్దలుకొట్టాలి" కంపెనీలో మేనేజరుమీద కోపం తల్లిమీద వుపయోగించాడు. ఆఫీసులో ఖర్చు జమా తబ్బిబ్బులు రాస్తే మేనేజరు "ఈ మాత్రం ఖాతా లెక్కలు రాయలేని నీకు బి.యే. పట్టం ఎందుకు? బి.యే. పట్టా బుట్టదాఖలా చేయకూడదూ? మా నెత్తినెక్కి మాడబ్బు తిని తందనాలు తొక్కకపోతే?" అన్నాడు.

సూర్యం కిక్కురుమనలేక పోయేడు. పరి భవాగ్ని గుండెలు మండించింది.

"వెంకన్న వైద్యుణ్ణి పిలుచుకురారా" తల్లి రుద్ధంగా అంది. "వెంకన్న వైద్యం, సింగన్న వైద్యం, నే వెళ్ళి డాక్టరునే పిల్చుకొస్తాను" అంటూ సూర్యం పోతూపోతూ శకుంతల ముఖం చూచేడు. బలహీనంగా నీరసకళలు అచ్చుగుద్దుకొని సుహాసాన్ని హత్యచేసినై! సూర్యం మనస్సులో ఆవేగం అధికమించింది.

డాక్టరు వచ్చి చూచేడు. "భయంకరమైన వ్యాధి, అయినా ఫర్వాలేదు. నయమవుతుంది. మందు తీసుకోవాలి. చాలా జాగ్రత్త! పిల్ల వాణ్ణి వేరే పడుకోబెట్టండి."

"ఏ దవ్వుతేనేం మనల్ని చంపడానికి" సూర్యంమాటల్లో వ్యంగ్యం గుర్తించింది, శక్కు.

తన్ని గురించే.

"నా పిల్లవాణ్ణి నానుంచి వేరుచేస్తారూ? నే నలా చెయ్యనివ్వను. నా ప్రక్కలోనే వుండాలి."

పిల్లవాణ్ణి పక్కగదిలోనే పడుకోబెట్టేరు. శకుంతల నీరసం రోజురోజుకూ ఎక్కువవు తోంది. వారంరోజులు తిరిగిపోయేయి.

"అమ్మా! కోడలి కేమైనా నయంగా వుందా?" సూర్యం అడిగాడు.

"ఏం నయంరా. డాక్టరుకి అయినంతా డబ్బు పోశాం. నయమవుతుందంటాడు. వ్యాధి లక్షణమలాగే వుంటుంది. నాలుగు రోజుల్లో తగ్గుతుందంటాడు. ఇటు చూస్తే పిల్లవాడు తల క్రిందులై పోతున్నాడు."

"వాడికేం."

"ఒళ్లు అగ్నిగుండంలాగుంది. చెబితేనమ్మవు."

మూసినకన్ను తెరవనేలేదు. డాక్టరు వచ్చి చూచేడు, మందులు సూదిపోట్లు తప్పలేదు.

సూర్యం శకుంతల దగ్గరికి వచ్చేడు.

"ఏం అబ్బాయికి జ్వరమేనా?"

పిల్లవాడి స్థితి అధ్వాన్నదశలో వుంది. కాటిలో కొష్ఠంలాగ వళ్ళు కాలిపోతోంది.

నాలుగు రోజులయింది. శకుంతలకి నీరసం తగ్గి లేచి తిరుగుతోంది. ఆరాత్రి ఎనిమిది గంట లయింది. సూర్యం పిల్లవాడిదగ్గరే వున్నాడు. పిల్లవాడేడుస్తున్నాడు.

మృత్యులోకంలో మృత్యుదేవత వికటాట్ట హాసం! భయంకర రోదన! మృత్యువర్గం ప్రళయ తాండవం చేస్తున్నై. ఆ మందిర ప్రాంగణంలో శోకరాగాలాలపిస్తున్నై. ఎంతో సూక్ష్మాతి సూక్ష్మజీవులు! వలయాకారంగా తిరుగుతూ ఉద్వేగంగా లేచిపోతున్నాయి. మృత్యుజీవులు నిశ్శబ్ద దుర్భర వాతావరణంలో గాలి హోరుమని ఏడుస్తూంది. విశ్వశ్రేణి పరి కీర్ణమైన కాలరేఖలు మృత్యుదేవుల నీలిచీర చెరగుల్లాగ, కొట్టుమిట్టాడుతున్నై.

"శకూ— అబ్బాయి కెల్లాగుంది?"

అబ్బాయి మృత్యుదేవి సామ్రాజ్యంకంమీద యోగనిద్ర పోతున్నాడు చిఱునవ్వుతో.